

# గారడీ

ప్రతాప రవిశంకర్



తనలోని శక్తినంతా కూడదీసుకుని ఢమరుకాన్ని మ్రోగిస్తున్నాడు నల్లగీత నిక్కరు వేసుకున్న కుర్రాడు. అతనికి నిండా పదేళ్ళు కూడాలేవు. అస్థిపంజరంలా వున్నాడు. అతని జుట్టు చిందర వందరగా వుంది. తనువు తనకు పనికిరాదని బయటకు నెట్టిన చెమట తల్లోనించి, ముఖం మీదినించి క్రిందికి కారుతుంటే దాన్ని అతడి చిరుగుల షర్టు ప్రేమతో తనలో ఇముడ్చుకుంటోంది.

ఉదయం తొమ్మిది గంటలకు పది నిముషాలు తక్కువే. వేసవి రోజులు కావడంవల్ల అప్పటికే సూర్యుడు రైలింజనులో మండుతున్న బొగ్గుకణంలా సెగలు కక్కుతున్నాడు.

రైల్వే స్టేషనుకు వందగజాల దూరంలో వున్న ఆ విశాలమైన ఖాళీ ప్రదేశంలో గొంతుక్కూర్చొని చెక్కపెట్టెలో నించి పుర్రెను, ఎముకలను బయటకు తీసి ఏదో ఆకారంలో పేర్చు తున్నాడు గళ్ళ లుంగీ కట్టుకున్న మనిషి. అతడికి కొంచెం దూరంలో అతని పెద్ద కూతురు గుడ్డల మూటను విప్పి అందులోనించి రకరకాల దేవతల పటాలను తీసి చిన్నచిన్న వెదురు పుల్లల ఆధారంలో వాటిని నేలమీద నిలబెడుతోంది.

భర్తనూ - కూతురినీ చూస్తూ లైటు స్తంభం దగ్గరున్న రావిచెట్టు కింద కూర్చుంది పసిబిడ్డను ఒళ్ళో పెట్టుకొని పాలిస్తున్న అతని పెళ్ళాం.

"మోగించరా కొడకా" ఓమారు నల్ల నిక్కరు కుర్రాడికేసి చూసి అరిచాడు గారడీ మనిషి.

అప్పుడే ఏదో రైలు వచ్చి స్టేషన్లో ఆగినట్టుంది. గుంపులు గుంపులుగా చేతిలో సంచీలతో వస్తున్నారు మనుషులు. వారందరినీ చూస్తూ ఢమరుకం మ్రోగించడం ఓ నిముషంపాటు మరచిన కుర్రాడు తండ్రి అదుపుతో పులిక్కిపడి ఢమరుకాన్ని గట్టిగా కదిలించాడు.

క్రమక్రమంగా చుట్టూ మనుషులు పోగవుతున్నారు. కొంచెం దూరంగా పోతున్న మనుషులనుకూడా ఢమరుకం చప్పుడు విశేషంగా ఆకర్షిస్తోంది. పది నిముషాల్లోనే చుట్టూ మూడువరుసల్లో వలయాకారంలో మనుషులు నిలబడ్డారు. రైలు దిగి వెడుతున్న పల్లెటూరి మనుషులు కూడా గారడీ చూట్టానికి ఆసక్తిగావచ్చారు.

నిల్చున్న మనుషులందరినీ ఓసారి కలియజూశాడు చాలా మంది పల్లెటూరి వాళ్ళే కనిపించి అతని ముఖం సంతోషంతో విప్పారింది. అందరి ముఖాల్లో కుతూహలాన్ని గమనించి గారడీలోని ఫస్టు ఐటమ్ మొదలుపెట్టాడు.

కొన్ని క్షణాలు కళ్లు మూసుకుని కుడి చేతిని నుదుటిమీద వుంచుకొని మనసులో దేవుడిని తలచుకొని కళ్లు తెరిచాడు.

క్రిందికి వొంగి పెద్ద మూటలోనించి చిన్న చెక్కపెట్టె బయటకుతీసి సొరుగు లాగి చుట్టూవున్న మనుషులకు చూపించాడు. దానిలోపల ఖాళీగా వుంది. అందరూ చూసిన తర్వాత చిన్నపిల్లల నుద్దేశించి "మీలో ఎవరైనా బాబు ఇసుంటికి రండి" అన్నాడు. భయపడి ఎవ్వరూ ముందుకు రాలేదు. "బయంనేదు బాబూ" అని అందరికేసి దృష్టి సారించాడు. ఇంతలో ఓ చిరుగుల చొక్కా కుర్రాడు లేచి దగ్గరకు వచ్చాడు.

"సెబాస్ బేటా" అంటూ ఆ కుర్రవాడి భుజం తట్టాడు అందరూ ఆశ్చర్యంగా చూశారు ఆ కుర్రాడి ధైర్యానికి.

జేబులోనుంచి పేకముక్క బయటకు తీసి పెట్టె సొరుగు లాగి అందులో వేసి తన చుట్టూ వున్న వారందరికీ చూపి రూపాయినోట్లను తెప్పిస్తానన్నాడు.

చేతులెత్తి ఓసారి అందరికీ దణ్ణం పెట్టి పెట్టెను పుర్రె ముందుపెట్టి దానిమీద ఎముకను వుంచి చిరుగుల చొక్కా కుర్రాడి దగ్గరకు వచ్చాడు.

"పెట్టెలో ఏమేసినాము బేటా" ఆ కుర్రాడినడిగాడు.

"పేకముక్క" చెప్పాడు కుర్రాడు.

"దాన్తో ఏటి సెయ్యమంటావ్?"

"రూపాయి కట్టలు"

"రూపాయి కట్టలతో ఏటి సేసుకుంటావ్?"

"పెళ్ళి."

"ఎవరిక్కా? నీకా? నాకా?"

"నాకే" సిగ్గుపడుతూ చెప్పాడు కుర్రాడు.

"డబ్బులు యిచ్చేది నేను.... పెళ్ళి సేసుకునేది నువ్వా? ఎదవకొడకా" అని తిడుతూ ఆ కుర్రాడి తల మీద ఎముకతో కొట్టాడు.

అతను తిడుతున్నది తన సొంత కొడుకునేననీ, ఆ కుర్రాడు ప్రతి గారడీ ఆటకు తిట్లు తింటాడని తెలియని మనుషులందరూ నవ్వుతున్నారు.

తర్వాత చెక్కపెట్టెను పైకెత్తి అందులోనించి రూపాయి నోట్లను బయటకుతీసి అందరికీ చూపించాడు. అందరూ ఆశ్చర్యంతో నోరు తెరిచారు.

రెండో ఐటమ్‌గా పామును ఆడిస్తానని బుట్టమీది మూతను తీశాడు. బుస్సుమని పైకిలేచి తోకమీద నిలబడి చేతిని కరి

చింది పాము. పిల్లలందరూ భయపడి రెండడుగులు వెనక్కి వేశారు.

చిన్న రేకు పెట్టెలోనించి తాయెత్తు బయటకుతీసి పాము తలమీద వుంచాడు. వెంటనే పాము తల వంచి బుట్టలో పడుకుంది. ఆ తాయెతును అందరికీ చూపించి అది దగ్గరవుంటే పాములు ఏమీ చెయ్యలేవని. పల్లెటూరివాళ్ళకు బాగా ఉపయోగమనీ చెప్పాడు. అక్కడి వారందరికీ ఆ నిముషంలో చాలామంది పాము కాటుతో చనిపోయిన సంఘటనలు కనుల ముందు కదిలాయి. వెంటనే ఎలాంటి సంకోచమూ లేకుండా చెప్పిన పావలా ఖరీదు చెల్లించి తాయెత్తులను కొన్నారు. అమ్మకం జోరుగా సాగింది.

మిగిలిన అంశాలుగా నోట్లోనించి కట్టలు కట్టలుగా తుమ్మముళ్ళను బయటకు తీశాడు. తనపెద్ద కూతుర్ని పడుకోబెట్టి ముసుగు కప్పి నాలుక కోసి అందరికీ చూపించాడు.

చాలామంది ఆనందంతో చప్పట్లు చరిచారు.

మరికొన్ని సాహసప్రదమైన విద్యలను ప్రదర్శిస్తానన్నాడు సాయిబు. ఆ మాటలు విని పసిబిడ్డకు పాలిస్తున్న సాయిబు పెళ్లాం వులిక్కిపడి బిడ్డను మరింత గట్టిగా గుండెలకు అదుముకుంది. రొమ్ముల్లో పాలు ఐపోయాయేమో బిడ్డ గుక్కపట్టి యేడుస్తోంది.

పొడుగాటి గడకర్రను నేలమీద నిలబెట్టాడు. అతని తమ్ముడు పదహారేళ్ళవాడు దాన్ని గట్టిగా పట్టుకున్నాడు.

కర్ర పైకి ఎగబాకాడు. రెండు నిముషాల్లో చివరివరకూ వెళ్ళి పొట్టను కర్ర చివర ఆనించి చేతులు వదిలాడు. జనంలో కలకలం....ఈలలు....చప్పట్లు.

తర్వాత క్రిందికి దిగి భార్య దగ్గరకు వెళ్ళాడు....

ఏడుస్తోంది....పమిటచెంగుతో కళ్ళు వత్తుకుంటోంది.

"ఏటికే ఏడుత్తావ్? నాను దానికి బాబును కాదేటి? బిడ్డంటే నాకూ పేముండాది. దానికేం బయంనేదు....దాని పానానికి పెమాదం రాదులే" అంటూ యేడాది నిండని పసి బిడ్డను తల్లి ఒడిలోనించి లాక్కోబోయేడు.

"వద్దు.... నాకేటికో బయమేత్తున్నాది. రేత్తిర్నుంచి గుంటకి జొరం సొలసొల కాగిపోతున్నాది. నాకేటికో మనసులో దిగులుగున్నాది.... ఇయాల్టికి వద్దు.... గుంట పానానికే మోసం.... నా మాట యినుకో" అంటూ భోరున యేడ్చింది.

## విలువ

ఒక పుస్తకాల పబ్లిషరు తన గ్రంథకర్తలలో ఒకాయనకు బంగారపు గడియారం బహూకరించాడు.

ఆ గ్రంథకర్త "గడియారం చూడటానికి బాగానేవుంది కాని ముళ్ళు కదలటం లేదు" అని గొణిగాడు.

"మీ పుస్తకాలూ అంతే. గోడౌనులో కట్టలు కట్టలు పడివున్నాయి" అన్నాడు పబ్లిషరు.

—జె. రాఘవేంద్రరావు, గుడివాడ

అందరూ అతనికేసి ఆత్రుతగా చూస్తున్నారు.

"ఆడదాని మాట ఇంటే మగాడేటి సెయ్యగలడే? పిచ్చి మొకమా....ఇటువంటి పెదర్శనలిత్తేనే బాబులు గుండె కరిగి డబ్బులేత్తారే....నీకేటి తెలుసే.... నాబిడ్డ జొరమొచ్చినా బయపడదే....ఇది నా బిడ్డే...." అనిబలవంతంగా బిడ్డను పెళ్ళాం చేతుల్లోంచి లాక్కుపోయేడు.

కుప్పలా నేలమీదకు ఒరిగిపోయింది భార్య.

రెండు నిలువు కడ్డీలను నేలలో పాతి దానిమీద మరో అడ్డకడ్డీని బిగించాడు తమ్ముడు. అడ్డ కడ్డీకి మధ్యన చిన్న ఇనుప కమ్ముల ఉయ్యాల బిగించబడివుంది. అతను దానిమీదకు ఎక్కి పైకీ క్రిందికీ వూగటం మొదలుపెట్టాడు. లారీ చక్రంలా తిరుగుతోంది ఉయ్యాల. తల క్రిందికి వస్తోంది. కాళ్లు పైకిపోతున్నాయి. అతని తమ్ముడు పసిబిడ్డ నడుముకు తాడు బిగించి రెండో చివరను అందించాడు! అతనితోపాటుపసిబిడ్డకూడా గిర్రున తిరుగుతోంది.

అందరూ వూపిరి బిగపట్టి చూస్తున్నారు.

బిడ్డ బిగ్గరగా యేడుస్తోంది, గుండెలు పగిలేలా యేడుస్తోంది భార్య. ఢమరుకం మ్రోగించడం ఆపేసి తల్లిని చూస్తూ చొక్కాతో కళ్ళు తుడుచుకుంటున్నాడు నల్లగీతల నిక్కరు కుర్రాడు.

ఉయ్యాల వేగం పెరుగుతోంది.

పళ్ళెం తీసుకొని డబ్బులు అడుక్కుంటున్నాడు తమ్ముడు.

చిల్లర నాణాలతో పళ్ళెం నిండిపోతోంది. అంతకంతకీ వేగం పెంచుతున్నాడు. చప్పట్లు చరుస్తున్నారు పిల్లలు. ఆ గోలలో బిడ్డ ఏడుపు ఆపిన విషయం ఎవ్వరూ గమనించలేదు.

ఓ నిర్జీవ కళేబరం అతని చేతిలో తాడుకు వూగుతోంది. దాన్నే వినోదంగా చూస్తున్నారు చుట్టూ వున్న మనుషులు.


